# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక




3లో...

## అమ్మవారికే శఠగోపం...!

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 307 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 17, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

# కొవాగ్జిన్‌తోనూ సైడ్ ఎఫెక్ట్స్

- 30 శాతం మందికి అనారోగ్య సమస్యలు
- ఎక్కువమందిలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు
- 0.3 శాతం మందికి హార్ట్ స్ట్రోక్ ముప్పు
- బీహెచ్‌యూ అధ్యయనంలో వెల్లడి





**న్యూఢిల్లీ, మే 16,(నమస్తే ఉదయం):** కొవిషీల్డ్ తీసుకున్న వారిలో తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయనే ఆందోళనలు కొనసాగుతుండగానే కొవాగ్జిన్‌పై జరిగిన ఓ అధ్యయనంలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొవిడ్‌కు విరుగుడుగా భారత్ బయోటెక్ తయారుచేసిన కొవాగ్జిన్ తీసుకున్న వారిలో దాదాపు 30 శాతం మంది వేర్వేరు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డారని బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి (బీహెచ్‌యూ) చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనంలో వెల్లడైంది.

కొవాగ్జిన్ తీసుకున్న 635 మంది యుక్తవయస్కులు, 291 మంది పెద్దవారిపై ఈ అధ్యయనం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'స్ప్రింగర్ నేచర్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కొవాగ్జిన్ అందుకున్న ప్రతి ముగ్గురిలో ఒకరు అనారోగ్య సమస్యలకు గురైనట్టు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న 304 మంది(47.9 శాతం) యుక్తవయస్కులు, 124 మంది(42.6 శాతం) మంది పెద్ద వయసు వారు శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల బారిన పడ్డారు.

యుక్తవయస్కుల్లో 10.5 శాతం మంది చర్మ సంబంధ రుగ్మతలను ఎదుర్కొన్నారు. 10.2 శాతం మంది సాధారణ అనారోగ్య సమస్యలు, 4.7 శాతం మంది నాడీవ్యవస్థకు సంబంధించిన ఇబ్బందులకు గురయ్యారు. పెద్ద వారిలో 8.9 శాతం మంది సాధారణ రుగ్మతలు, 5.8 శాతం మంది మస్కులోస్కెలిటల్ సమస్యలు, 5.5 శాతం మంది నాడీ వ్యవస్థ సమస్యలను మిగతా.. 2లో

# ఎవరికీ ప్రత్యేక మినహాయింపు లేదు

## 'కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్'.. అమిత్‌షా వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు





**న్యూఢిల్లీ, మే 16,(నమస్తే ఉదయం):** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయంలో తామేమీ ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. ఏది న్యాయసమ్మతమని భావించామో దానిని మేం మా తీర్పులో స్పష్టం చేశాం' అని తెలిపింది. తాత్కాలిక బెయిల్ అంశంలో కేజ్రీవాల్‌కు కోర్టు ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇచ్చిందని దేశంలో పలువురు భావిస్తున్నారంటూ కేంద్ర హోంమంత్రి, బీజేపీ కీలకనేత అమిత్‌షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విధంగా స్పందించింది.

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ తనను అరెస్టు చేయటాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దింపకర్‌దత్తాలతో ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అమిత్‌షా పేరు ప్రస్తావించకుండా ఆయన చేసిన వ్యాఖ్యలను ఉదహరించారు.

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఆ అంశంలోకి వెళ్లదల్చుకోలేదని చెబుతూనే, ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపింది. అయితే, తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను తాము స్వాగతిస్తామని ధర్మాసనం పేర్కొనటం విశేషం. కాగా, ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) ఓట్లు వేసి గెలిపిస్తే జూన్2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండబోదని ఇటీవల ఓ సభలో కేజ్రీవాల్ చెప్పారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా కేజ్రీవాల్ బెయిల్ షరతులను మిగతా.. 2లో





## ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీల దృష్టి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం పోటీ

**హైదరాబాద్,మే16(నమస్తే ఉదయం):** తెలంగాణ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక హడహుడి మొదలైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లారాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. పోటీ చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈనెల 27న పోలింగ్ జరగనుండడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి. బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. మిగతా.. 2లో

# రాజధానిలో జడివాన..

## హైదరాబాద్‌లో కుండపోత.. యూసుఫ్‌గూడలో 9 సెం.మీ., మలక్‌పేటలో 8 సెం.మీ.పైనే


- లోతట్టు ప్రాంతాల జలమయం
- ట్రాఫిక్‌తో వాహనదారుల ఇక్కట్లు
- జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి
- తడిసిన ధాన్యం.. పంటలకు దెబ్బ
- నేడు, రేపు కూడా వానలు
- అధికారులూ అప్రమత్తం: సీఎం



**హైదరాబాద్, (నమస్తే ఉదయం):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు, కొమ్మలు విద్యుత్తు తీగలపై విరిగిపడటంతో పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం వరకు నగరంలో ఎర్రటి ఎండలే కాయగా.. 3 గంటల తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై భారీ వర్షం పడింది. యూసుఫ్‌గూడలో 9 సెం.మీ., బంజారాహిల్స్ వెంకటేశ్వరకాలనీ 8.7 సెం.మీ, మలక్‌పేటలో 8.5, బేగంబజార్‌లో 8.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జూబ్లీహిల్స్, అమీర్ పేట, ఎర్రగడ్డ, నాంపల్లి, అంబర్‌పేట, బేగంబజార్, గోల్కొండ, గౌలిగూడ, ఖైరతాబాద్, ఆసిఫనగర్, షేక్‌పేట, ఫిల్మ్‌నగర్, చార్మినార్, మూసాపేట, మోతీనగర్, మాదాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బోరబండ ప్రాంతాల్లోనూ వాన దంచికొట్టింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 9 ఉదయనగర్ కాలనీలో నాలా రిటైనింగ్‌వాల్ కూలడంతో రోడ్లపై నిలిచిన వాహనాలు కొట్టుకుపోయాయి. ఆగాపురా, ఆస్మాన్‌గఢ్, మల్కాజిగిరి, రామచంద్రాపురంలో చెట్లు, కొమ్మలు విద్యుత్తు తీగలపై విరిగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టారు. ఫిల్మ్‌నగర్, శ్రీకృష్ణానగర్ బీబ్లాక్ ప్రాంతాల్లో పలు షాపుల్లోకి వదర నీరు చేరింది. మధురానగర్, ఫిలింనగర్ , బేగంబజార్, మన్సూరాబాద్ డివిజన్ సాయినాథ్ కాలనీల్లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిల్చి గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. వర్షాల నేపథ్యంలోనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 040-2111 1111, డీఆర్‌ఎఫ్ నంబర్ 90001 13667కు సంప్రదించాలని వెల్లడించారు.

### పలు జిల్లాల్లోనూ వర్షాలు..

ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ఇటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం పడింది. దీంతో పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల కాంటా వేసిన ధాన్యం బస్తాలుకూడా తడిసి ముద్దయ్యాయి. హనుమకొండ పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. వరంగల్, నిజామాబాద్ పట్టణాల్లో భారీ వర్షం పడటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో పలుచోట్ల రోడ్లపై మిగతా.. 2లో




## టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

- వెబ్‌సైట్లో అందుబాటులోకి తెచ్చిన అధికారులు

**హైదరాబాద్,మే16(నమస్తే ఉదయం):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఇటీవల ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మే 20 నుంచి జూన్ 2వరకు వివిధ తేదీల్లో జరిగే ఈ పరీక్షల హాల్‌టికెట్లను అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. బుధవారమే హాల్‌టికెట్లను విడుదల చేస్తారని అభ్యర్థులు ఎదురుచూసినప్పటికీ.. మే 16న విడుదల చేస్తామని పేర్కొన్న అధికారులు గురువారం సాయంత్రం వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థులు తమ జర్నల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు ఎంటర్ చేసి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెట్ కోసం 2,83,441 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మే 20 నుంచి జరిగే ఈ పరీక్షలు మిగతా.. 2లో

# అప్పు తగ్గించుకుందాం!

- ప్రాజెక్టుల రుణాల రీస్ట్రక్చరింగ్ దిశగా సర్కారు యత్నాలు
- తక్కువ వడ్డీకి రుణాలిచ్చే జైకా, ఏడీబీ, కొరియన్ బ్యాంక్
- ఐడీఆర్‌డీ వంటివాటికి అప్పులను మళ్లించే ఆలోచన
- ఈ దిశగా ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు
- రఘురామ్‌రాజన్ సూచనతో మోదీతో సీఎం భేటీ
- రీస్ట్రక్చరింగ్ ద్వారా నాలుగు శాతానికి తగ్గనున్న వడ్డీ రేటు
- తద్వారా నెలకు రూ.700-900 కోట్ల మేర వడ్డీ ఆదా



**హైదరాబాద్, మే 16 (నమస్తే ఉదయం):** వివిధ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్ల పేర తీసుకున్న గ్యారంటీ అప్పులను రీస్ట్రక్చర్ చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు 'రుణాల రీస్ట్రక్చరింగ్'పై పరిశీలన చేయా లంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రం అప్పులకుప్పలా మారిపోయిం దని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పులు గుదిబండలా మారాయని రేవంత్ సర్కారు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబరులో అధికారం చేపట్టిన తర్వాత.. కొద్దినెలల వ్యవధిలోనే పార్లమెంటు ఎన్నికలు రావడం, మార్చి నెలలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడంతో ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అంతగా దృష్టి సారించలేకపోయింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తి కావడంతో ఆ అంశంపై దృష్టి పెట్టి.. అప్పుల సమస్యను పరిష్కరించుకునే మార్గాలను అన్వేషిస్తోంది. అందునా ప్రధానంగా కార్పొరేషన్ల మిగతా.. 2లో



# రాష్ట్రంలో మళ్లీ భూమ్..

- రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల సవరణ
- రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీలు కూడా..
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు
- చార్జీలను శాస్త్రీయంగా నిర్ధారించాలని నిర్దేశం..
- సమన్వయంతో ఆదాయం పెంచాలి
- ఎగవేతలు, అవినీతి, అక్రమాలకు చెక్ చెప్పాలి..
- సామాన్యులకు ఇసుక కొరత రావొద్దు
- రాబడుల శాఖల అధికారులతో సమీక్ష..
- నిరుడు ఆశాజనకంగా లేదని అసంతృప్తి



**హైదరాబాద్, మే 16 (నమస్తే ఉదయం):** రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చి పెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల విలువల భారీగా పెరిగాయని, కానీ.. అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో మిగతా.. 2లో

# సీఏఏని ఎవరూ తీసేయలేరు!

- ఏం చేస్తారో చేసుకోండి..
- 'ఇండీ' కూటమికి ప్రధాని సవాల్
- ఆ చట్టం అమలు మొదలైంది
- శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేస్తున్నాం
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు
- లాక్కునేందుకు విపక్షాల కుట్ర
- యూపీ ప్రచారంలో మోదీ ఫైర్



**ఆజంగఢ్/జాన్‌పూర్, మే 16,(నమస్తే ఉదయం):** తాము అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తీసేస్తామన్న విపక్ష 'ఇండీ' కూటమిపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఆ చట్టాన్ని ఎవరూ తీసివేయలేరని, ఏం చేస్తారో చేసుకోండని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. గురువారం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో పలు చోట్ల ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. బుధవారం 16 మంది శరణార్థులకు భారత పౌరసత్వం ప్రదానం చేయడాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో సీఏఏ అమలు మొదలైపోయిందన్నారు. విపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

'పౌరసత్వం పొందిన శరణార్థులు హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు. దీర్ఘకాలంగా దేశంలో శరణార్థులుగా జీవిస్తున్నారు. మతప్రాతిపదికన జరిగిన దేశవిభజన బాధితులు వీరు. గద్దెనెక్కితే సీఏఏని తీసివేస్తామని ఇండీ కూటమి అంటోంది. కానీ ఎవరూ ఈ చట్టాన్ని తొలగించలేరు. వేల మంది కి పౌరసత్వం ఇవ్వబోతున్నాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసకారి పార్టీ అని.. మతతత్వ జ్వాలల్లో దేశం తగులబడేలా చేసిందని ధ్వజమెత్తారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను కూడా తాము తీసివేశామన్నారు. శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి ఇటీవల జరిగిన పోలింగ్ మిగతా.. 2లో



## ప్రజావ్యతిరేకతను మూటకట్టుకున్న కాంగ్రెస్

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఈటెల

**నల్లగొండ,మే16(నమస్తే ఉదయం):** అతి తక్కువ సమయంలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ అంటూ ఈటల రాజేందర్ తీవ్రంగా విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఇప్పటికే విశ్వాసం కోల్పోయారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. త్వరలోనే వరంగల్-నల్గొండ -ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ తరఫున గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. ఆయన తరఫున పార్టీకి చెందిన కీలక నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. మిగతా.. 2లో

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక



# ఎమ్మెల్సీ ఎన్నికపై పార్టీల దృష్టి

**మొదటిపేజీ తరువాయి..**

మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ కు పది రోజుల సమయం ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 2021 వ సంవత్సరంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. అయితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో పల్లా రాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2021 జరిగిన ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించలేదు. 2021 ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్ రెడ్డి, తీన్మార్ మల్లన్న నువ్వానేనా అన్నట్టుగా పోటీ పడగా పల్లా విజయం సాధించారు. ఈ నెల 27 న పోలింగ్ జరగనుండడంతో 10 రోజుల సమయం ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీ ఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న, బిజెపి అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తోపాటు 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న బీ ఆర్ ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ ఉండనుంది. తీన్మార్ మల్లన్న 2021 ఎన్నికల్లో కొద్ది తేడాతో ఓడిపోయారు. ఈ సారి ఓటమి సానుభూతితో పాటు కాంగ్రెస్ అధికారంలో ఉండటం కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇక బీ ఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్ రెడ్డి బిట్స్ పిలాని స్టూడెంట్ గా పేరుంది. అంతే కాకుండా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా పనిచేశారు. అంతే కాకుండా బీ ఆర్ ఎస్ లో పల్లా వర్గంగా పేరుంది. కాబట్టి పల్లా రాజేశ్వర్ రెడ్డి , రాకేష్ రెడ్డి కోసం తీవ్ర కృషి చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పెద్దగా ప్రభావం చూపెట్టలేక పోవచ్చు. ఎందుకంటే ప్రేమేందర్ రెడ్డి గత రెండు ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపెట్టలేదు. అంతేకాకుండా బిజెపి నుండి కొంత ఓటింగ్ రాకేష్ రెడ్డికి పోలింగ్ అయ్యే అవకాశం లేకపోలేదు. కాబట్టి పోటీ ఇద్దరి మధ్య ఉండని చెప్పవచ్చు. 2021 ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ ఓటు హక్కును ఐదు లక్షల మందికిపైగా నమోదు చేసుకున్నారు. ఉప ఎన్నికపై ఇతరుల పట్టభద్రులకు పెద్దగా ఆసక్తి లేకపోవడంతో ఓటింగ్ నమోదుకు వెనుకడుగు వేశారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలో 4 లక్షల 27 వేల 289 మంది పట్టభద్రులు మాత్రమే తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అయితే మూడు జిల్లాల పరిధిలో పట్టభద్రుల సంఖ్య లక్షల్లో ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకున్నందుకు పట్టభద్రుల ఆసక్తి చూపలేదని చెప్పవచ్చు. ఈనెల 27న జరగే ఎన్నికల్లో కూడా ఓటు వేసేందుకు పట్టభద్రులు ఉత్సాహం ప్రదర్శిస్తారా అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష బిజెపి పార్టీలు ఛాలెంజ్ గా తీసుకున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో సిట్టింగ్ స్థానాన్ని వదులుకోకూడదని బీఆర్ఎస్. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం కోసం తీవ్ర కసరత్తు చేస్తుంది. ఆయా పార్టీల నేతలు సైతం ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్రుల స్థానాన్ని వదులుకోవద్దని రెండు పార్టీలు చూస్తున్నాయి.

# టెట్ హాల్‌టిక్కెట్లు విడుదల

**మొదటిపేజీ తరువాయి..**

ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు; అలాగే, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు సెషన్లలో జరగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం టెట్ ఫలితాలు జూన్ 12న విడుదలయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటే 7032901383 నంబర్‌కు సంప్రదించవచ్చని విద్యాశాఖ అధికారులు సూచించారు.

# ప్రజావ్యతిరేకతను మూటకట్టుకున్న కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి..**

నల్గొండ జిల్లా కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సన్నాహక సమావేశానికి ఈటల రాజేందర్ హాజరై.. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టయ్యిందని అన్నారు. కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. కాంగ్రెస్ నేతల అవినీతికి, దందాలకు అడ్డులేదని.. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే గొంతుక లేకుంటే అధికార పక్షానిదే ఏకపక్షం అవుతుందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# కొవాగ్జిన్‌తోనూ సైడ్ ఎఫెక్ట్స్

**మొదటిపేజీ తరువాయి..**

ఎదుర్కొన్నారు. 4.6 శాతం మంది మహిళలకు రుతుక్రమానికి సంబంధించి సమస్యలు వచ్చాయి. 2.7 శాతం మందిలో కంటి సమస్యలు, 0.6 శాతం మందిలో హైపోథైరాయిడిజం వచ్చినట్టు గుర్తించారు.

## వెయ్యి మందిలో ముగ్గురికి స్ట్రోక్ ముప్పు

కొవాగ్జిన్ తీసుకున్న 0.3 శాతం మందిలో స్ట్రోక్, 0.1 శాతం మందిలో గులియన్-బారే సిండ్రోమ్ లాంటి తీవ్ర సైడ్ ఎఫెక్ట్స్‌ను గుర్తించారు. రెండు డోసులు తీసుకున్న వారిలో కంటే మూడు డోసులు తీసుకున్న వారిలో సైడ్ ఎఫెక్ట్స్ తీవ్రత నాలుగింతలు, ఒక డోసు తీసుకున్న వారిలో రెండింతలు ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు. కొవాగ్జిన్ తీసుకున్న 926 మందిపై ఈ అధ్యయనం జరగగా వీరిలో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు మరణించారు. కొవాగ్జిన్‌తో ఎక్కువ సైడ్ ఎఫెక్ట్స్ చాలాకాలం పాటు కొనసాగుతున్నందున ఆలస్యంగా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్‌ను అర్థం చేసుకునేందుకు వ్యాక్సిన్ తీసుకున్న వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం సూచించింది.

## కొవాగ్జిన్ సురక్షితం: భారత్ బయోటెక్

ఈ అధ్యయనంపై కొవాగ్జిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ స్పందించింది. కొవాగ్జిన్‌పై అనేక అధ్యయనాలు జరిగాయని, ఈ విషయాలన్నీ ప్రఖ్యాత జర్నల్లలో ప్రచురితమయ్యాయని పేర్కొన్నది. అన్ని అధ్యయనాలూ కొవాగ్జిన్ సురక్షితమైనదని తేల్చాయని తెలిపింది. వాక్సిన్‌పై జరిగే అధ్యయనం ప్రభావవంతంగా, పూర్తి సమాచారంతో ఉండాలని, పరిశోధకులకు పక్షపాతం ఉండొద్దని పేర్కొన్నది.

# ఎవరికీ ప్రత్యేక మినహాయింపు లేదు

**మొదటిపేజీ తరువాయి..**

ఉల్లంఘించారన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'ఆయన జూన్2న లొంగిపోవాలని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అది సుప్రీంకోర్టు ఆదేశం. చట్టబద్ధ పాలనకు అదే ఆధారం. కేసు విషయంలో ఆయన ఏమీ మాట్లాడకూడదని మేం చెప్పలేదు. కాబట్టి ఆయన ఏం అనుకుంటున్నారనేది మాకు అనవసరం. దానిపై మేమేమీ చెప్పలేం' అని వ్యాఖ్యానించింది. ఆప్‌ను గెలిపిస్తే తాను జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించలేదని, కావాలంటే దానిపై ఆయన అఫిడవిట్ సమర్పిస్తామని సింఘ్వీ తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తిహాడ్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేజ్రీవాల్‌పై త్వరలో ప్రాసిక్యూషన్ ఫిర్యాదును నమోదు చేస్తామని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది.

# ఇండోర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

## ప్రమాదంలో 8 మంది దుర్మరణం

**అహ్మదాబాద్,మే16(నమస్తే ఉదయం):** దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓవర్‌టెక్, మద్యం తాగి నడపడం, అతి వేగం తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఎందరో అమాయకులు బలవుతున్నారు. కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. తాజాగా గురువారం మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 8 మంది మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం, జీపు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఘటాబిలౌడ్ సమీపంలో జీపు గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టిందని అదనపు పోలీసు సూపరింటెండెంట్ రూపేష్ కుమార్ ద్వివేది తెలిపారు.

ప్రమాదం తర్వాత డ్రైవర్ పరారీ అయితే ప్రమాదం తర్వాత డ్రైవర్ సంఘటన స్థలం నుండి పారిపోయాడని, అతన్ని పట్టుకునేందుకు గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు పోలీసులు. ప్రమాదం జరిగిన వివరాలను పోలీసులు స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వాంగ్మూలం వచ్చిన తర్వాతే ఈ ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టమవుతుంది.

# అప్పు తగ్గించుకుందాం!

**మొదటిపేజీ తరువాయి..**

గ్యారంటీ అప్పులను రీస్ట్రక్చర్ చేయించుకోవాలని ఆలోచిస్తోంది. ఈ రుణాలను ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు బదిలీ చేయించుకుని, వడ్డీ సొమ్మును ఆదా చేసుకోవాలన్నది సర్కారు ఆలోచన. ఇలా కనీసం నెలకు రూ.700-900 కోట్లు ఆదా అవుతాయని భావిస్తోంది. అంటే సంవత్సరానికి ఎంత లేదన్నా రూ.10,000 కోట్లు ఆదా అవుతాయని, ఖజానాకు ఇది పెద్ద ఊరటనిస్తుందని ఆశపడుతోంది.

## రెండు రకాల అప్పులు..

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రెండు రకాలు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో, ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ(ఎఫ్ఆర్‌బీఎం) చట్ట నిబంధనలకు లోబడి చేసే బహిరంగ మార్కెట్ రుణాలు(ఓఎంబీ) ఒక రకం కాగా.. బడ్జెట్‌లో చూపాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలతో వివిధ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్లు తీసుకునే అప్పులు రెండో రకం. బడ్జెట్ రుణాలను ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి తీసుకుంటుంది. అంటే... సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం చేసే వ్యయాలకు రాష్ట్ర రాబడుల సొమ్ము సరిపోనప్పుడు, బడ్జెట్ అప్పులతో పూడ్చుకుంటుంది. వడ్డీతో సహా ఆ అప్పులను ప్రభుత్వమే తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు 'కాగ్'కు సమర్పించాల్సి ఉంటుంది. ఆ అప్పులపై పరిపూర్ణమైన ఆడిటింగ్ జరుగుతుంది. ఇక, బడ్జెట్‌తో సంబంధం లేకుండా చేసే కార్పొరేషన్ల అప్పులకు ప్రభుత్వం గ్యారంటీలు ఇస్తుంటుంది. ఇలాంటి అప్పులతోనే సమస్య వచ్చి పడుతోంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం 9 నుంచి 12 శాతం దాకా అధిక వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చింది. అవే ఇప్పుడు సర్కారు మెడకు చుట్టుకున్నాయి. కార్పొరేషన్లకు ఆ అప్పులను తీర్చే ఆర్థిక తాహతు లేకపోవడంతో వాటిని ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి అప్పులు ప్రస్తుతం రూ.1,27,208 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో కాళేశ్వరం సాగునీటి పారుదల ప్రాజెక్టు కార్పొరేషన్ పేర రూ.79000 కోట్ల అప్పు ఉంది. ఈ కార్పొరేషన్ ద్వారా సేకరించిన అప్పుల్లోనే కొంత సొమ్మును పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మళ్లించారు. ప్రస్తుతం ఈ రుణానికి సంబంధించి ప్రభుత్వం నెలకు దాదాపు రూ.1200 కోట్ల చొప్పున ఏటా రూ.14,406కోట్ల వడ్డీని చెల్లించాల్సి వస్తోంది. మిగతా కార్పొరేషన్ల అప్పు రూ.50 వేల కోట్లను కూడా కలుపుకొంటే.. రూ.2000 కోట్ల వరకూ నెలవారీ వడ్డీలకే పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభు త్వం వాటిపైనే దృష్టి సారించింది. ఇలాంటి ప్రాజెక్టులకు 4 శాతం వడ్డీలతో రుణాలిచ్చే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కోకొల్లలుగా ఉన్నాయని, వాటి వద్ద బ్యాంకుల్లో డబ్బు మూలుగుతుంటే.. గ్యారంటీలిచ్చి అప్పులు తీసుకునేవాడే లేడని అంటున్నారు. అందుకే అలాంటి అంతర్జాతీయ సంస్థలకు రాష్ట్ర అప్పులను బదలాయించాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది.

## రీస్ట్రక్చరింగ్ అంటే?

ప్రస్తుతమున్న అప్పులను అంతర్జాతీయ స్థాయిలో తక్కువ వడ్డీలకు రుణాలిచ్చే ఆర్థిక సంస్థలకు బదిలీ చేయడమే ఈ రీస్ట్రక్చరింగ్ విధానం. అయితే, రుణాల బదిలీకి అంతర్జాతీయ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఒప్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభు త్వం తరపున పూచీ పడాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. రుణాలను రీస్ట్రక్చర్ చేయించుకోవాలంటూ ఆయన ఇచ్చిన సూచన మేరకు రేవంత్ ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి దీనిపై మాట్లాడారు. తక్కువ వడ్డీలతో రుణాలిచ్చే సంస్థలను రుణాల బదిలీకి ఒప్పించాలని అడిగారు. అయితే, కార్పొరేషన్ల పేర తీసుకున్న అప్పులను అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు బదిలీ చేయాలంటే ఆ సంస్థలు రకరకాల వివరాలు అడుగుతాయి. గ్యారంటీ అప్పులను చెల్లించే స్తోమత ఆయా కార్పొరేషన్లకు ఉందని ప్రభు త్వం వాటిని సంతృప్తిపరిస్తేనే అప్పుల బదిలీకి అంగీకరిస్తాయి. ఉదాహరణకు.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.5000 కోట్ల వార్షిక రాబడి ఉంటుందని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అంచనా వేసింది. ఇదే విషయాన్ని వివిధ బ్యాంకులకు వివరించి అప్పులు తెచ్చారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనే ప్రకటించారు. ఈ మేరకు.. పరిశ్రమలకు సరఫరా చేసే కాళేశ్వరం నీరు, వివిధ మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీకి సరఫరా చేసే నీటికి చార్జీల రూపంలో కార్పొరేషన్‌కు సొమ్ము వస్తుందని.. అది అప్పు, వడ్డీల చెల్లింపునకు ఉపయోగపడుతుందంటూ అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం వివరించనుంది. తద్వారా అంతర్జాతీయ సంస్థలు తక్కువ వడ్డీకే రుణాలను బదిలీ చేసుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

## రాష్ట్రానికి మేలే

రుణాల రీస్ట్రక్చరింగ్‌తో రాష్ట్రానికి మేలు జరిగే అవకాశాలున్నాయని ఆర్థిక శాఖాధికారులు వివరిస్తున్నారు. నెలకు కనీసం రూ.700 నుంచి రూ.900 కోట్ల వడ్డీ ఆదా అయినా.. ఎంతో కొంత ఊపిరి పీల్చుకోవచ్చని వారు ఆశిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు 'జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జైకా)', 'ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ)', 'ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్(ఐబీఆర్‌డీ)', కొరియన్ బ్యాంకు వంటివి తక్కువ వడ్డీలకే రుణాలిస్తున్నాయి. వీటి వార్షిక వడ్డీ శాతాలు 2 నుంచి 4 వరకు ఉంటాయి. తీసుకునే రుణ కాల పరిమితి, రుణ గ్రహీత దేశం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని, వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయి. ఎంతైనా వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ప్రస్తుత వడ్డీల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది.

# రాష్ట్రంలో మళ్లీ భూమ్..

**మొదటిపేజీ తరువాయి..**

రిజిస్ట్రేషన్లు-స్టాంపు డ్యూటీల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదని గుర్తించారు. చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే, "గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచింది.

ఇప్పటికీ చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏటా భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టండి" అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలో.. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు... ఇలా వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, ఈ విషయంలో రిజిస్ట్రేషన్ల శాఖ నిబంధనలను పక్కాగా పాటించాలని నిర్దేశించారు. రాష్ట్ర రాబడి పెంపుతోపాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర స్టాంప్ డ్యూటీ ఎంత ఉందో పరిశీలించాలని, దీనిని తగ్గించాలా.. పెంచాలా.. అనే దానిని అధ్యయనం చేయాలని ఆదేశించారు. సామాన్యులకు, చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని, ఇసుక ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు.

## గత ఏడాది ఆదాయం ఆశాజనకంగా లేదు

గతేడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలంటూ అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్‌లో పొందుపర్చిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏనెలకానెలా టార్గెట్‌ను నిర్దేశించుకుని రాబడిని సాధించేందుకు కృషి చేయాలని నిర్దేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి రాబ డి తెచ్చి పెట్టే జీఎస్టీలో ఎగవేతలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీఎస్టీ వసూళ్లను పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని, జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని తేల్చి చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కారాదని, జీఎస్టీ రిటర్న్స్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినా.. లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణా, పన్ను ఎగవేతలు లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని, శాఖాపరమైన లొసుగులు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికీ చాలాచోట్ల కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు చెట్ల కింద నిలబడే ఉంటున్నారనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది.

దాంతో, ప్రజోపయోగాని కి సేకరించిన స్థలాలను గుర్తించి.. వాటిలో కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం చెప్పారు.

# సీఏఏని ఎవరూ తీసేయలేరు!

**మొదటిపేజీ తరువాయి..**

సందర్భంగా.. ప్రజాస్వామ్య పండుగలో ప్రజలు సగర్వంగా పాల్గొన్నారని.. ఈ అధికరణను ఎవరూ పునరుద్ధరించలేరనడానికి ఇది నిదర్శనమని తెలిపారు.

సమాజ్‌వాదీ పార్టీ, దాని అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై ప్రధాని మండిపడ్డారు. గతంలో ఆజంగఢ్‌ను ఉగ్రవాద కేంద్రంగా తయారుచేశారని.. బాంబు పేలుళ్లకు పాల్పడినవారికి క్షమాభిక్ష పెట్టారని.. రాజకీయాల ముసుగులో స్లీపర్ సెల్స్ పనిచేశాయని.. ఈ కారణంగా దేశమంతటా ఉగ్రవాదం విస్తరించిందని ఆరోపించారు. 'కాంగ్రెస్, సమాజ్‌వాదీ వేర్వేరు పార్టీలైనా రెంటికీ ఒకే దుకాణం ఉంది. బుజ్జగింపు రాజకీయాలు, అబద్ధాలు, కుటుంబ వాదం, అవినీతిని అక్క డ అమ్ముతుంటారు.

ఈ ఎన్నికల్లో బుజ్జగింపుల ట్రిపుల్ డోస్‌తో ముందుకొచ్చారు. రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను లాక్కుని.. తమ ఓటుబ్యాంకుకు కట్టబెట్టాలనుకుంటున్నారు. అలాగే ఈ కూటమి మీ (ప్రజల) ఆస్తిలో సగం తీసుకుని తమ ఓటుబ్యాంకుకు ఇవ్వాలనుకుంటోంది. మైనారిటీలకు ప్రత్యేక బడ్జెట్ పెడతామంటోంది.

నేను బతికున్నంతవరకు ఇలాంటివి జరగనివ్వను. కాంగ్రెస్ వాళ్లు ఎక్స్‌రే మెషీన్ (కులగణన) తెచ్చారు. గత వారం రోజులుగా వారి ఎజెండాను బయటపెడుతున్నాను. ఆ మెషీన్‌పగిలిపోయినట్లే కనిపిస్తోంది' అని అన్నారు. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత అయోధ్యలో రామాలయం నిర్మించుకున్నామని.. యావద్దేశంతో పాటు ప్రపంచంలోని ప్రతి భారతీయుడు ఇందుకు ఆనందిస్తున్నారని.. కానీ కుటుంబవాదులు మాత్రం దూషిస్తున్నారని విమర్శించారు. సమాజ్‌వాదీ యువరాజు (అఖిలేశ్), ఆయన బాబాయి రామాలయం పనికిమాలినదని అంటున్నారని, కాశీని కూడా ఎద్దేవా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రపంచంలో భారత్ సత్తాను చాటే ప్రధానిని ఎన్నుకోవడానికి ప్రస్తుత ఎన్నికలు అవకాశమని మోదీ అన్నారు. ఐదేళ్లలో ఐదుగురిని ప్రధాన మంత్రులను చేయాలని ఇండీ కూటమి అనుకుంటోందని ఎద్దేవాచేశారు. జూన్ 4 తర్వాత ఈ కూటమి విచ్ఛిన్నమవుతుందని



చెప్పారు. ఫలితాలు వచ్చాక ఢిల్లీ, లఖ్‌నవూ యువరాజులు (రాహుల్‌గాంధీ, అఖిలేశ్) వేసవి విహార యాత్రకు విదేశాలకు వెళ్తారని ఆయన అన్నారు.


## హిందూ బడ్జెట్.. ముస్లిం బడ్జెట్!

మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. మైనారిటీలకు బడ్జెట్‌లో 15% కేటాయించాలని కాంగ్రెస్ ప్రతిపాదించిందని మోదీ తెలిపారు. అప్పట్లో తాను గుజరాత్ సీఎంగా ఉన్నానని.. బీజేపీ దీనిని పూర్తిగా వ్యతిరేకించిందని, దాంతో వెనక్కి తగ్గారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ఆ ప్రతిపాదన తెస్తోందన్నారు. 'కాంగ్రెసను ఎన్నుకుంటే బడ్జెట్‌ను హిందూ బడ్జెట్, ముస్లిం బడ్జెట్‌గా విభజిస్తుంది. దీనిని నేను అనుమతించను. మతప్రాతిపదికన రిజర్వేషన్‌కూ అంగీకరించను. బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు' అని తెలిపారు. మోదీ వ్యాఖ్యలను కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఖండించారు. 2013లో ముస్లిం బడ్జెట్ తేవాలని కాంగ్రెస్ అనుకోలేదని.. ఇది పూర్తిగా తప్పని, ఈ వ్యాఖ్యలు దారుణమని, మోదీ ప్రసంగ రచయితలకు మతిభ్రమించినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. వాస్తవానికి 2013లో వ్యవసాయంపై ముఖ్యమంత్రులతో కమిటీ వేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ భావించారని.. ఆ తర్వాత మోదీ ప్రధాని అయ్యారని జైరాం తెలిపారు.

# రాజధానిలో జడివాన..

మొదటిపేజీ తరువాయి..

చెట్లు విరిగిపడ్డాయి.



మునుగోడులో ఈదురుగాలులకు తోటల్లో మామి డి, నిమ్మకాయలు రాలిపోయాయి. కోహీర్ మండలం బిలాల్‌పూర్‌లో ఐదెకరాల అరటి తోట నేల కొరిగింది. పలుచోట్ల కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి. చేవెళ్ల, కేశంపేట, యాచారం, దోమ, ఆలేరు, వలిగొండ మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధారూర్ మండలంలో నాగారంలో 500 బస్తాలకు పైగా ధాన్యం తడిసింది.

**పిడుగులు పడి ముగ్గురి మృతి..**

పిడుగులు పడి వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌లోని భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(42) పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వేములవాడ మునిసిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన కంబళ్ల శ్రీనివాస్ (30), రేగుల దేవ య్య, రేగుల శ్రీనివాస్, కంబళ్ల కొమురవ్వ, కంబళ్ల ఎల్లయ్య చింతచెట్ల కాయలు దులిపేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే భారీవర్షంతో పిడుగుపడి శ్రీనివాస్ మృతి చెందగా.. మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు. కద్తాల మండలం వాసుదేవ్‌పూర్‌లో మాడ్గుల మండలం కలకొండకు చెందిన పసునూరి ప్రవీణ్‌చారి (32), అతని మామ నాగోజు జంగాచారిపై పిడుగు పడింది. దీంతో ప్రవీణ్‌చారి మృతి చెందగా.. జంగాచారితో పాటు మరొకరు గాయపడ్డాడు. పరిగిలో వర్షానికి ప్రహరీ గోడ



కూలి 15 మేకలు మృతి చెందాయి.

**అప్రమత్తంగా ఉండండి: సీఎం**

వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ సహా అన్ని ప్రాంతాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గురువారం సచివాలయం నుంచి అన్ని విభాగాల



అధికారులతో ఆయన మాట్లాడారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**నేడు, రేపు వర్షాలు..**

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశ ముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండ్రో జులు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగిన ఆవర్తనం.. గురువారం మధ్యప్రదేశ్‌కు నైరుతి ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలో ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయని పేర్కొంది.

# అమ్మవారికే శఠగోపం...!

## దేవాదాయ భూమి దర్జాగా రిజిస్ట్రేషన్

## మరోమారు అమ్మకానికి అమ్మవారి ఆస్థి

## రూ.15 కోట్ల రూపాయల విలువైన భూమి అన్యాక్రాంతం

## దేవాదాయ శాఖకు గ్రామస్తుల ఫిర్యాదు





**షాద్ నగర్,మే16(నమస్తే ఉదయం):** డబ్బు సంపాదన కోసం ఏకంగా అమ్మవారి ఆస్థికే ఎసరు పెట్టారు ఆ ప్రబుద్ధులు..దేవాలయానికి చెందిన కోట్ల విలువైన భూమిని యదేచ్ఛగా రిజిస్టర్ కూడా చేసుకున్నారు.దేవాదాయ శాఖ కళ్లు గప్పి తమ కబందాల్లోకి తీసుకున్న సదరు భూమిని మరోమారు అమ్మజూపుతూ భూ పందేరానికి తెరలేపి.దేవుడి భూమినీ మాయం చేయాలని చూస్తున్న మాయగాళ్ళ బాగోతంపై ప్రత్యేక కథనం...ఆ అమ్మవారి దయ ఉంటే అంతా మంచే జరుగుతుంది.ఆమె ఆశీస్సుల కోసం నిత్యం ఉపవాసాలు ఉంటూ పూజలు చేసే వారూ ఉన్న ప్రస్తుత తరుణంలో ఆ అమ్మవారి ఆస్థినే టార్గెట్ చేశారు.ఏకంగా అమ్మవారి ఆలయ భూములను క్రయ,విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకోవాలని చూస్తున్న వ్యక్తులు లేకపోలేదు.రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలో వెలుగు చూసిన ఈ బాగోతం మీరే చదవండి.రంగారెడ్డి జిల్లా పరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో గల శ్రీ అంబా భవాని మాత దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయం ప్రతి నిత్యం కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్నది.ఈ దేవాలయాన్ని పూర్తిగా 2008 సంవత్సరంలో దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుంది.అయితే గ్రామంలోని శ్రీ అంబా భవాని మాత దేవాలయం పేరున గ్రామ శివారులో సర్వే నెంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటల భూమి ఉంది.బహిరంగ మార్కెట్ లో సదరు భూమి విలువ సుమారుగా 15 కోట్ల పైమాటే.ఈ మొత్తం భూ విస్తీర్ణాన్ని దేవాదాయ శాఖ రిజిస్టరు 43 లో గతంలోనే నమోదు చేసింది.ఇదిలా ఉండగా ఈ భూమిపై కన్నేసిన కొందరు వ్యక్తులు అనుభవదారులమంటూ చెప్తూ 2015 లో అక్రమంగా 2031/ 2015 డాక్యుమెంట్ ద్వారా రిజిష్టర్ చేశారు.ఈ తరహాలో రిజిష్టర్ చేసుకున్న తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య ను రెవెన్యూ రికార్డులో పట్టాదారునిగా చూపారు.అయితే సదరు భూమిని కొన్న వ్యక్తి మరోమారు భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న గ్రామస్తులు కొందరు అంబా భవాని మాత దేవాలయానికి సంబంధించిన భూములను కాపాడాలంటూ దేవాదాయ శాఖ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.నిబంధనలకు విరుద్ధంగా అమ్మవారి ఆస్థిని అమ్మిన వారిపై, కొన్నవారిపై కఠిన చర్యలు తీసుకుని అంబా భవాని మాత ఆలయ భూములను కాపాడాలని కొరారు.అయితే ఇదే తరహాలో షాద్ నగర్ నియోజక వర్గంలో చాలా వరకు దేవదాయ భూములు అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తుంది.మరి ఆ శాఖ అధికారులు ఈ విషయంలో ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



శివరాంపల్లి దారుల్ ఉలూమ్ వద్ద నీళ్లలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు




శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద సర్వీస్ రోడ్డులో నిలచిన వరద నీటిని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్, ఏ ఈ వెంకోబా

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో వర్షం ఇబ్బందులు పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

## 20 సంవత్సరాలుగా ఇదే దుస్థితి - పట్టించుకునేవారు లేక ప్రజల అవస్థలు

**రాజేంద్రనగర్, మే16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ లో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి . వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అత్తాపూర్ నుంచి పీడీపీ వైపు వెళ్లే మార్గంలో ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద, శివరాంపల్లి బెస్ట్ ప్రైస్ వద్ద, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి క్రింద, రాందేవ్ బాబా దేవాలయం సమీపంలో వర్షపు నీటో రోడ్డుపై నిలిచి ఉంటుండడంతో వాహన దారులు గంట నుంచి రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.




ఉప్పర్‌పల్లి 191 పిల్లర్ వద్ద రోడ్డుపై నిలచిన వరద నీరు

### ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద....

గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షం కారణంగా ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద వరద నీరు రోడ్డుపై చేరి చెరువు ను తలపించింది. మెహదీ పట్నం వైపు నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలు 191 పిల్లర్ వద్ద నిలిచిపోయాయి. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సమస్య గత 20 సంవత్సరాలుగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలువ ఉండడం కూడా వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉంది. శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద సర్వీస్ రోడ్డు లో ఉన్నటువంటి డ్రైనేజీ పైప్ లైన్ బ్లాక్ కావడంతో ప్రతిసారి వర్షం పడినప్పుడు ఈ సమస్య ఎదురవుతుంది. ఈ సమస్యకు పరిష్కారం చూడాల్సిన అధికారులు ఆ దిశలో ముందుకు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద....

వర్షం పడినప్పుడల్లా ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీరు చేరుతుంది. మురుగు నీరు కూడా లీకేజ్ అవుతుండడంతో రైల్వే బ్రిడ్జి కింద నిల్వ ఉన్న నీటిలో డ్రైనేజీ నీరు కలిసి దుర్వాసన వెదజల్లుతుంది. వాహనాల రాకపోకలకు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలోనే వాహనాలు నడుపుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### సమస్యలకు పరిష్కారం చూపరా ..

వర్షం పడినప్పుడల్లా వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు బాధను వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు బాగు చేసే అధికారులు శాశ్వతమైన పరిష్కారం కనుగొనాలని సూచిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని కోరుతున్నాను. శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం : డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

రాజేంద్రనగర్ సర్కిల్‌లో వర్షం కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలలో వరద నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా కావలసిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటి కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. వర్షం పడిన వెంటనే బృందాలుగా విడిపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

ఉప్పర్ పల్లి 191 పిల్లర్ వద్ద, శివరాంపల్లి బెస్ట్ ప్రైస్ వద్ద, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద, ఎలాంటి ఇబ్బందులు కలకుండా నాతోపాటు అధికారులు కలిసి సమస్యను గంట నుంచి రెండు గంటల లోపల పరిష్కరించాం. ప్రజలు మ్యాన్ హెూల్‌లను తొలగించ వద్దన్నారు. చెత్తను మ్యాన్ హెూల్‌లో వేయవద్దని సూచించారు.



బాబుల్ రెడ్డి నగర్‌లో రోడ్డుపై వర్షం నీరు



# కరిగిన.. ఖాకి హృదయం

## స్పృహ కోల్పోయి పడివున్న వృద్ధురాలను ఆసుపత్రికి తరలించిన ఏఎస్ఐ

## స్పందించని కన్నకొడుకు

## ఏఎస్ఐకి సర్వత్ర అభినందనలు

**నాగర్ కర్నూల్ ,మే16(నమస్తే ఉదయం):** ఒకవైపు ఎండలు.. మరోవైపు ఆకలి.. దప్పికలు తట్టుకోలేక స్పృహ కోల్పోయి పడి ఉన్న ఓ వృద్ధురాలు పట్ల ఓ ఖాకి స్పందించిన తీరు అందరి హృదయాలను చూరగొంటుంది. వివరాలలోకి వెళితే నాగర్ కర్నూల్ మండలం దేశి ఇటిక్యాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యుల నిరాదరణ వల్ల అయితే నేమి.. ఇతర కారణాలవల్ల అయితే నేమి నాగర్ కర్నూలు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఎండ తీవ్రత .. ఆకలి దప్పికలతో .. అలసిపోయి స్పృహ తప్పిపోయింది. పాదాచారులు కొంతమంది చూసి విషయాన్ని పోలీసులకు చేరవేశారు. ఏఎస్ఐ వజ్ర లింగం వృద్ధురాలు వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించాడు. ఏ మాత్రం ఆలోచించకుండా ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించడంలో తన వంతు పాత్ర పోషించాడు. వృద్ధురాలు ఆచూకీ తెలుసుకొని కుమారుడికి ఫోన్ చేస్తే అతను స్పందించకపోవడంతో.. గ్రామస్తులు సహకారంతో కూతురుకు సమాచారం అందించాడు. కూతురు ఆసుపత్రికి చేరుకొని తన తల్లి బాగోగులు చూసుకుంటుంది. సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. సామాజిక మాధ్యమాలలో ఇందుకు సంబంధించిన దృశ్యాలు హల్చల్ చేస్తున్నడంతో నె టిజర్లు అభినందనలు తెలుపుతున్నారు.

# కూలీల ఆటో బోల్తా!

## పలువురు మహిళా కూలీలకు గాయాలు.

## మెరుగైన చికిత్సకు ఆస్పత్రికి తరలింపు.

## ర్యాస్ డ్రైవింగ్ లపై వెల్లువెత్తుతున్న విమర్శలు.

**అయిజ , మే 16(నమస్తే ఉదయం):** అయిజ పట్టణ కేంద్రంలో గురువారం కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురు మహిళా కూలీలకు గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అయిజలోని కాలమ్మ పేటకు చెందిన సుమారు 30 మంది కూలీలు ఉదయం ఆటోలో బయలుదేరారు. కట్టకింద తిమ్మప్ప స్వామి దేవాలయం సమీపంలో కూలీలతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న కొందరు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన కూలీలను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. నిబంధనలు అతిక్రమించి కొందరు ఆటోల డ్రైవర్ లు సామర్థ్యానికి మించి కూలీలను ఆటోలలో ఎక్కించుకుని, ర్యాస్ డ్రైవింగ్ చేయటం వల్ల కూడా ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటువంటి వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు అంటున్నారు.



# దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదం..

## కాటేదాన్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఏక్తా పార్టీ జాతీయ కోఆర్డినేటర్ సానేం రాజు గౌడ్

**రాజేంద్రనగర్,మే16 (నమస్తే ఉదయం):** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ కోఆర్డినేటర్ సానేం రాజు గౌడ్ అన్నారు.గురువారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ పరిశ్రామిక వాడలోని సీతారాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో సానేం పురుషోత్తం గౌడ్, ఆవులబోల్లి కొండప్ప,ఆవులబోల్లి లక్ష్మి దేవమ్మ జ్ఞాపకర్తం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సానేం రాజు గౌడ్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. .ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రంతో ప్రతిరోజూ స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. వేసవిలో బాటసారులు,ప్రయాణికుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చల్లివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ ఐ.ప్రసాద్,యాదగిరి, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.




కాటేదాన్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఏక్తా పార్టీ జాతీయ కోఆర్డినేటర్ సానెమ్ రాజు గౌడ్

### ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్ల కోసం

# దరఖాస్తు చేసుకోండి

**జిల్లా ప్రతినిధి,మే 16(నమస్తే ఉదయం):** జిల్లాలో ఉత్తమ పాఠశాలలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికాణి శ్వేత ప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద డే స్కాలర్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1వ తరగతిలో డే స్కాలర్స్‌గా ప్రవేశం కోసం 2018 జూన్ 1 నుంచి మే 30 వరకు పుట్టిన, 5 తరగతి ప్రవేశానికి 4వ తరగతి బోనాఫైడ్ సర్టిఫికెట్ జత చేయాలన్నారు.జిల్లాకు మొత్తం 57 నాన్ రెసిడెన్సియల్ ,59 రెసిడెన్సియల్ సీట్లు కేటాయించడం జరిగింది అన్నారు.అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు గ్రామీణ ప్రాంతాల్లో, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతాల వారికి ఉండాలన్నారు.కుల, ఆదాయ, రేషన్ కార్డు, 2 పాస్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ ఉండాలని చెప్పారు. బాలుర బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఫారాలు ఈనెల 18 నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉచితంగా పొందగలరు,

దరఖాస్థులను పూర్తి చేసి స్వయంగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. జూన్ 07వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఇతర వివరాల కోసం 9603117181 , 7981067369 నెంబర్లను సంప్రదించగలన్నారు.




వరి ధాన్యం మద్దతు ధర 500 పెంచాలని అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

# అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాలి

**- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉరుకుందు**

**కేటిదొడ్డి,మే16(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. గురువారం కేటిదొడ్డి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉరుకుందు అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉరుకుందు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు, రాజకీయాలు తప్ప.. రైతాంగం కష్టాలు పట్టడంలేదని విమర్శించారు. ఓవైపు అకాల వర్షాలతో, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు స్తంభించిపోవడంతో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికలు ముగిసినందున.. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని అన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతు, యుగంధర్, కొండయ్య, నాసరుద్దీన్, వీరేష్, శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, హెచ్ తాయప్ప తదితరులు పాల్గొన్నారు.




### ప్రాథమిక పాఠశాల సిబ్బందికి ప్రతినెల వేతనాన్ని అందిస్తున్న

# శ్రీరంగం ఫౌండేషన్....

**కూకట్‌పల్లి, మే 16 (నమస్తేఉదయం):** కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, అదేవిధంగా పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగంను కోరగా అందుకు శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023 -2024 విద్యా సంవత్సరానికి గాను ప్రతి నెల వేతనాన్ని ఇస్తామని ఇచ్చిన మాట ప్రకారం మే నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతుల మీదుగా వారి కార్యాలయంలో గురువారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు : కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్‌పల్లి, మే 16 (నమస్తే ఉదయం)** కాంగ్రెస్ పార్టీ గెలిపే ధ్యేయంగా పార్లమెంట్ ఎన్నికలలో పనిచేసిన ప్రతి ఒక్కరికి ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.



పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయం కోసం పనిచేసిన ప్రతిఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, పుట్టం దేవి, సౌందర్య, అనురాధ, కృష్ణవేణి, యోగేశ్వరి, నాగలక్ష్మి, నిర్మలమ్మ, అన్నపూర్ణ, శ్యామల, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల ఎంపీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

# రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో బిజెపిదే హవా : కొండా విశ్వేశ్వర్ రెడ్డి

### చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ గెలుపు ఖాయం

**రాజేంద్రనగర్,మే16(నమస్తే ఉదయం):** చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీదేనని చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ లోని వెంగమాంబ హోటల్లో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ ముఖ్య కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై ప్రసంగించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీజేపీ అధిక మెజారిటీని సాధిస్తుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.దేశ ఖ్యాతి,పేరు ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని స్పష్టం చేశారు.రెండు నెలలుగా చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులు,కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీకి ఓటువేశారని గుర్తుచేశారు.ప్రజల గుండెల్లో ప్రధాని నరేంద్రమోదీ



ఎన్నికల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి

ఉన్నారని, మూడోసారి కూడా మోదీ ప్రధాని అవుతారని తెలిపారు.అన్ని వర్గాల ప్రజలు బిజెపికే ఓటువేశారని తెలిపారు.కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. బీజేపీపై ఉన్న నమ్మకంతో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేశారని గుర్తుచేశారు.ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,డాక్టర్ ప్రేమ్ రాజ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి,మల్లారెడ్డి, బొక్క బాల్ రెడ్డి,గౌతమి రెడ్డి, మహాలింగం గౌడ్,కొమురయ్య,చంద్రయ్య,మేకల వనితారెడ్డి, లక్ష్మీనారాయణ,బిక్షపతి యాదవ్,విజయ్ కుమార్, వెంకటయ్య, దేవేందర్, బీరప్ప, సులిగే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు...

**పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు...**

**అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి...**

**తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...**



**కూకట్‌పల్లి, మే 16 (నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గతంలో బిఆర్ఎస్ కబ్జా చేస్తున్నారన్న విషయం లిఖితపూర్వకంగా, ఫోటోలు రూపకంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోవడం లేదని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అధికారుల తీరుపై మండిపడ్డారు. 129 డివిజన్ సంజయ్ గాంధీనగర్లో గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల పై గతంలో జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివిజన్ సీనియర్ నాయకులు గొల్ల జాన్ జిహెచ్ఎంసి అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు భూపతి రెడ్డి కి, జ్యోత్స్న శివారెడ్డి కి, పున్నారెడ్డి కి, కెఎం ప్రతాప్ కి, కూన శ్రీశైలం గౌడ్ వారితోపాటు జిహెచ్ఎంసి ప్రిన్సిపల్ సెక్రటరీ కి, బాలానగర్ ఏసీపీ కి లికితపూర్వకంగా ఫిర్యాదును చేయడం జరిగింది అని అన్నారు. విచిత్రం ఏంటి అంటే ఈ కబ్జాదారులను డివిజన్ కి సంబంధించిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రోత్సహించడం హాస్యాస్పదంగా ఉందని, మరి వారి పేర్లు కూడా ఫిర్యాదులో చేర్చడం జరిగిందని అన్నారు. ఎవరున్నా లేకున్నా పార్టీ కోసం నిలబడతామనీ, అవసరమైతే ప్రాణాలను సైతం లెక్కచేయబోమని ఈ సందర్భంగా గొల్ల జాన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 129 డివిజన్ అధ్యక్షులు రహమతుల్లా, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల విషయంలో బీఆర్ఎస్ బ్యాచ్ గగ్గోలు చూస్తుంటే

# “గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట”

**సామెత గుర్తుకువస్తోంది:**

**వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి**

**కొత్తకోట, మే 16(నమస్తే ఉదయం):** మాజీ ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధినేత

కల్వకుంట్ల చంద్రశేఖరరావు పదేళ్ల పాలనలో రైతు సమస్యలు పట్టించుకునే నాధుడే లేడని వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఓ ప్రకటనలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ధాన్యం తడిస్తే కొనే దిక్కులేదన్నారు.అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే పైసా సాయం లేదన్నారు.పంటల బీమా పథకం లేదన్నారు. వరి కుప్పలపై రైతులు గుండెలు పగిలి చచ్చినా పట్టించుకున్న నాథుడు లేడన్నారు. ఖమ్మంలో మిర్చికి ధర అడిగినందుకు గిరిజన రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేసిం దన్నారు. వరంగల్ లో పత్తి రైతుల ఆత్మహత్యల గోస విన్నది లేదు.ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం 8 వేల పై చిలుకు రైతులు మరణిస్తే ప్రభుత్వంలో చలనం లేదు. ౖతులకు ఎరువులు ఫ్రీ అని మోసం చేసి మొండి చేయి చూపితే తప్పు లేదు. 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ.1 లక్ష రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి 2023 ఆగస్టు వరకు దాని ఊసే ఎత్తకుండా.. ఎన్నికలు వస్తున్నాయని మొదలు పెట్టిన



రుణమాఫీ రైతుకు చేరనే లేదు.- ౖతులకు సంబంధించిన అన్ని సబ్సిడీలు బంద్ చేస్తే తప్పు లేదు- వరి వేస్తే ఉరేనని రైతులను బెదిరిస్తే అన్యాయం అన్నోడు లేడు.కాంట కాడ దళారుల చేతివాటంతో క్వింటాల్ కు 10 కేజీలు తరుగు పేరుతో దోచేసినా ఏ నాడు పట్టించుకోని కేసీఆర్.- సివిల్ సప్లై కార్పోరేషన్ లో రూ.56 వేల కోట్ల అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ సర్కారు.- 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో ఒక వైపు స్కాం మరోవైపు 10 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వని కేసీఆర్ఇన్ని పాపాలు చేసి రైతుల పాలిట శాపాలుగా మారి ఇప్పుడు తగుదునమ్మా అని

100 రోజుల పాలనలోనే రైతు భరోసా రూ.7,500 కోట్లు వేసి- ఆగస్టు 15 లోపు రైతుకు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యచరణ ప్రకటించి,- వచ్చే పంట నుండి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్న - అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చి- పంటల బీమాకు శ్రీకారం చుట్టి

- ప్రతి పంటకు మద్ధతు ధర ఇవ్వడానికి సిద్ధమైన ప్రజా ప్రభుత్వాన్ని,

- విమర్శించడమే పనిగా పెట్టుకున్న కెసిఆర్ అండ్ కో కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.


**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.